క్లుప్తంగా

రేపటి నుంచి ఉరుసు ఉత్సవం

పీలేరు రూరల్ : పీలేరు పట్టణం కట్టుకాలువ వీధి బిలాల్ మస్జిద్ దగ్గర హజరత్ పీర్ సయ్యద్ అరబ్‌షాఇవలి ఖాద్రి, హజరత్‌పీర్ సయ్యద్ మహమ్మద్‌పీర్‌షా ఖాద్రి దర్గా వద్ద సోమవారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు చాందిని, బుజ్జు, సద్దాం, చోటూ, షాజహాన్ తెలిపారు. సోమవారం గంధం, మంగళ, బుధవారం ఉరుసు సందర్భంగా ఖవ్వాలీ పాటకచ్చేరి ఉంటుందన్నారు. మంగళవారం రాత్రి అన్నదానం కార్యక్రమం ఉంటుందని తెలిపారు. హిందూ ముస్లిం సోదరులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ప్రభుత్వ పాఠశాలల్లో స్కౌట్స్, గైడ్స్ విస్తరిస్తాం


సెల్యూట్ చేస్తున్న విద్యార్థులు

మదనపల్లె సిటీ: ప్రభుత్వ పాఠశాలల్లో స్కౌట్స్, గైడ్స్‌ను విస్తరిస్తామని భారత్ స్కౌట్స్, గైడ్స్ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్ అన్నారు. శనివారం మదనపల్లె మండలం చీకలబైలు ప్రభుత్వ పాఠశాలలో ధ్యాన్‌చంద్, నేతాజీ స్కౌట్స్, గైడ్స్ యూనిట్లు ప్రారంభించారు. క్రమశిక్షణతో పాటు సేవాగుణం అలవడుతుందన్నారు. విద్యార్థులు స్కౌట్స్,గైడ్స్‌లో చేరాలని సూచించారు. కార్యక్రమంలో శకుంతల, ఉపాధ్యాయులు ఎం.వెంకటరమణ, ఉమాదేవి, రమణమ్మ, రమాభార్గవి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి


మొక్కలు నాటుతున్న దృశ్యం

పీలేరు రూరల్ : ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలని తహసీల్దార్ ఎం. భీమేశ్వర్‌రావు అన్నారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శ్రమదానం నిర్వహించి, ప్రాంగణంలో ఉన్న పిచ్చిమొక్కలు, చెత్తాచెదారం తొలగించారు. అనంతరం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మానవ మనుగడకు మొక్కలే ఆధారమని తెలిపారు. కార్యక్రమంలో డీటీ సుబ్రమణ్యం, సర్వే కిరణ్మయి, వీఆర్వోలు, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు


గాయపడిన పెద్దరెడ్డప్ప, కాంతారావు

తంబళ్లపల్లె: వ్యవసాయ కూలీలతో వెళుతున్న ఆటో ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన శనివారం మండలంలో చోటు చేసుకుంది. బాధితుల కుటుంబీకుల కథనం మేరకు... గోపిదిన్నెకు చెందిన పెద్దరెడ్డప్ప(60), కాంతారావు(60) పొలం నుంచి ఇంటికి వస్తుండగా ములకలచెరువు నుంచి వ్యవసాయకూలీలతో వస్తున్న ఆటో గోపిదిన్నె సమీపంలో ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ద్విచక్రవాహనంలో ఉన్న పెద్దరెడ్డప్ప, కాంతారావులకు తీవ్రగాయాలయ్యాయి. ఇద్దరికి కుడి కాళ్లు విరిగాయి. గుర్తించిన స్థానికులు 108 వాహనంకు సమాచారం అందించి తంబళ్లపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెడికల్ ఆఫీసర్ తేజస్వి ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం మదనపల్లెకు రెఫర్ చేశారు.

శివపార్వతుల అలంకారం


శివపార్వతుల అలంకారంలో అయ్యప్పస్వామి

మదనపల్లె సిటీ: స్థానిక అయ్యప్పనగర్‌లోని శ్రీ బాల అయ్యప్పస్వామి ఆలయంలో శనివారం స్వామికి శివ,పార్వతుల అలంకారం చేశారు. స్వామికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామికి పుష్పాభిషేకం చేశారు. అయ్యప్పమాలాధారులు భజనలు నిర్వహించారు. అనంతరం అన్నసంతర్పణ జరిగింది. కార్యక్రమంలో అయ్యప్ప ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చెక్కుచెదరని శిల్పకళ

- శ్రీ చెన్నకేశవస్వామి ఆలయంలో 60 అడుగుల ఏకశిల ధ్వజస్తంభం
- 16వ శతాబ్దంలో ఆలయాన్ని నిర్మించిన విజయనగర రాజులు
- సందర్శకులను ఆకట్టుకుంటున్న ఆలయంలోని శిల్పకళ


శ్రీచెన్నకేశవస్వామి ఆలయం ఎదుట 60 అడుగుల ఏకశిలా ధ్వజస్తంభం



ఆలయం గోపురంపై ఇప్పటికి చెక్కుచెదరని శిల్పకళ , ఏకశిల రాతితో చెక్కిన కళ్యాణ మండపం

ములకలచెరువు: ములకలచెరువు మండలం సోంపల్లె పంచాయతీలోని సోంపాళ్యానికి ఆలయాల ఊరుగా పేరుంది. ఇక్కడ శ్రీచెన్నకేశవస్వామి, శ్రీచౌడేశ్వరీదేవి, నందీశ్వరుడు, శ్రీ మల్లికార్జున స్వామి ఆలయాలు ఉన్నాయి. సోంపాళ్యంలో అప్పట్లో విజయనగర, చోళరాజులు పలు ఆలయాలను నిర్మించారు.

60 అడుగుల భారీ ఏకశిల ధ్వజస్తంభం:

16వ శతాబ్దంలో విజయనగర రాజులు నిర్మించిన శ్రీ చెన్నకేశవస్వామి ఆలయం ఉంది. ఆలయంలో అడుగు పెట్టినప్పటి నుంచి అద్భుత శిల్పాలు సందర్శకుల కళ్లను తిప్పుకోకుండా చేస్తాయి. ఆలయం లోపల ఏక శిలతో చెక్కిన రాతి రథం, రాతి కళ్యాణ మండపం ఉన్నాయి. అలాగే గొల్లమండపం, ఊంజల్ మండపాలు ఉన్నాయి. ఆలయం ఎదుట 60 అడుగుల భారీ ఏకశిల ధ్వజస్తంభం ఉంది. ఈ ధ్వజస్తంభం దేశంలోనే పెద్దదైన వాటిలో రెండో స్థానంలో నిలిచింది. ఈ ఆలయం ప్రస్తుతం పురావస్తు శాఖ ఆధీనంలో ఉంది. అదేవిధంగా నందీశ్వరుడు, శ్రీ మల్లికార్జునస్వామి ఆలయం, శ్రీవీరాంజనేయస్వామి ఆలయాలు ఉన్నాయి. వీటిని 16వ శతాబ్దంలో విజయనగర రాజులు నిర్మించారు. శ్రీ వీరాంజనేయస్వామి ఆలయ గోపురాలపై పెరిగిన రావిచెట్లు కారణంగా గోపురం కూలిపోయింది.

చోళరాజులు నిర్మించిన శ్రీ చౌడేశ్వరిదేవి ఆలయం

11వ శతాబ్దంలో చోళరాజులు నిర్మించిన శ్రీ చౌడేశ్వరిదేవి ఆలయం ఉంది. అప్పట్లో ఈ ప్రాంతాన్ని తమిళనాడు రాష్ట్రం తంజావూరు కేంద్రంగా రాజేంద్ర చోళ చక్రవర్తి పశ్చిమ చాళుక్యులపై యుద్ధం చేసి విజయం సాధించారు. దీనికి గుర్తుగా చౌడేశ్వరిదేవి ఆలయం నిర్మించారు. యుద్ధంలో విజయం సాధించడంతో చోళ చక్రవర్తి ఆరాధించే అమ్మవారి విగ్రహం ప్రతిష్ఠించారు. యుద్ధ దేవతగా అమ్మవారు సప్త గ్రామాల ప్రజల పూజలందుకుంటున్నారు.

ప్రత్యేక శిబిరాలు సద్వినియోగం చేసుకోండి


గ్యారంపల్లె తపాలా కేంద్రంలో ఆధార్‌నమోదు సేవలు

కేవీపల్లె : తపాలా శాఖ నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలని పీలేరు పోస్టల్ ఇన్స్‌పెక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. శనివారం మండలంలోని గ్యారంపల్లె తపాలా కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీలేరు డివిజన్‌లో పీలేరు, కల్లూరు, భాకరాపేట, దామలచెరువు, మంగళంపేట, గ్యారంపల్లె, రొంపిచెర్ల, చిన్నగొట్టిగల్లు కేంద్రాల్లో 25,802 మందికి ఐపీపీబీ ఖాతాలు ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం ప్రవేశపెట్టబోతున్న వివిధ సంక్షేమ పథకాలకు సంబంధించి నగదు బదిలీ ఎన్‌పీసీఐ అనుసందానం తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. ఈ నెల 15వ తేదీ లోపు ఆయా తపాలా కేంద్రాల్లో లబ్ధిదారులు ఆధార్ నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోస్ట్‌మాస్టర్ రెడ్డిబాబు, సిబ్బంది హరీష్, సతీష్, నాగరాజ, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి వాల్మీకుల సదస్సు జయప్రదం చేయండి


రామసముద్రంలో పోస్టరును ఆవిష్కరిస్తున్న వాల్మీకులు

రామసముద్రం : వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చడం కోసం రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే వర్క్‌షాపులలో భాగంగా ఈ నెల 15న మదనపల్లెలో జరిగే సదస్సుకు వాల్మీకులంతా తలరివచ్చి జయప్రదం చేయాలని జిల్లా వాల్మీకి సంఘ నాయకులు పిలుపునిచ్చారు. శనివారం మండలంలో వాల్మీకి నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ఎన్నికల సమయంలో వాల్మీకుల సహాయ సహకారాల కోసం అసత్య హామీలు ఇచ్చి ఓట్లు వేయించుకుని కాలం గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వాల్మీకుల సమస్యల సాధన కోసం ప్రతి ఒక్కరు ఏకం కావాలన్నారు. కార్యక్రమంలో వాల్మీకి రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు నాగినేని గోవిందు, ఎగ్జిగిటివ్ మెంబర్ మల్లికార్జున, జిల్లా వాల్మీకి గౌరవ అధ్యక్షులు శ్రీనివాసులు, చిన్నారెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకటరమణ, లక్ష్మన్న, శేఖర్, లక్ష్మీనారాయణ, రామసముద్రం మండల ఉపాధ్యక్షుడు కదిరప్ప, సుబ్రహ్మణ్యం, రమణ, శ్రీనివాసులు, కృష్ణమూర్తి, చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ఔట్‌సోర్సింగ్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

– ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ


జిల్లా ఆస్పత్రి ఎదుట నిరసన తెలుపుతున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బంది

మదనపల్లె : ప్రభుత్వ సర్వజన బోధన ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న ఔట్‌సోర్సింగ్ వర్కర్లు 8 నెలలుగా వేతనాలు లేకుండా పనులు చేస్తున్నారని, వారికి వేతనాలు చెల్లించడంలో ప్రభుత్వ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ ఆరోపించారు. ఔట్ సోర్సింగ్ వర్కర్లను ఆప్కాస్ లో చేర్చి వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శనివారం ఆసుపత్రి వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సాంబశివ మాట్లాడుతూ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బీసీ జనార్దన రెడ్డి, మంత్రి రాంప్రసాద్ రెడ్డి, ఎమ్మెల్యే షాజహాన్ బాషా తదితరులు జిల్లా ప్రభుత్వ సర్వజన బోధనాసుపత్రిని సందర్శించి ఔట్ సోర్సింగ్ వర్కర్స్‌తో మాట్లాడి వారిని ఆప్కాస్‌లో చేర్చి వేతనాలు చెల్లించడానికి కృషి చేయాలని కోరారు. 2024 మార్చి నుంచి ఔట్ సోర్సింగ్ సిబ్బంది కి వేతనాలు చెల్లించకపోతే వారి కుటుంబాలు ఎలా గడుస్తాయని అధికారులు ఆలోచన చేయాలన్నారు. స్థానిక సబ్ -కలెక్టర్ ను, సంబంధిత అధికారులను కలిసినా జీతాలు చెల్లించే విషయంలో పట్టించు కోవడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో ఔట్ సోర్సింగ్ సిబ్బంది శ్రీనివాసులు , దాము,కొండప్ప,సూర్య, ప్రకాష్, సులోచన, రాజేశ్వరి, గంగాదేవి, గణేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ తనిఖీల్లో కర్ణాటక మద్యం స్వాధీనం

నిందితుడి అరెస్ట్, బైక్ సీజ్


కర్ణాటక మద్యం తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

మదనపల్లె : ఎక్సైజ్ పోలీసుల తనిఖీల్లో కర్ణాటక మద్యం రవాణా చేస్తున్న వ్యక్తిని అరెస్ట్‌చేసి, మద్యంతో పాటు బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ భీమలింగ తెలిపారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ...మదనపల్లె-బి.కొత్తకోట మార్గమధ్యంలోని కాండ్లమడుగు క్రాస్‌లో కర్ణాటక, కోలార్ జిల్లా లక్ష్మీపురం నంబువారిపల్లెకు చెందిన ఎస్.సి. శ్రీనాథ్(40), ఏపీ-03 ఏజెడ్-5657 హీరోహోండా ప్యాషన్ ప్రో బైక్‌లో కర్ణాటకకు చెందిన ఎన్‌డీపీఎల్ 48 డబుల్‌కిక్ టెట్రాప్యాకెట్లు తరలిస్తుండగా పట్టుకోవడం జరిగిందన్నారు. నిందితుడి నుంచి రూ.1,680 విలువచేసే 4.32 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకోవడంతో పాటు అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

ఉచిత కంటి ఆపరేషన్లకు 42 మంది ఎంపిక


కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

గుర్రంకొండ: మండలంలోని తరిగొండలో నిర్వహించిన ఉచిత కంటివైద్య శిబిరంలో 42 మంది ఉచిత కంటి ఆపరేషన్లకు ఎంపికయ్యారు. శనివారం స్థానిక ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాలలో మదనపల్లె ఎల్వీప్రసాద్ కంటి ఆస్పత్రి వారి అధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ప్రముఖ కంటి వైద్యనిపుణులు సాంబశివ, వంశీకృష్ణలు పర్యవేక్షణలో 102 మందికి ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో 28 మందికి ఉచితంగా కంటి అద్దాలను పంపిణీ చేశారు. 12 మందికి సాధారణ సమ్యలను గుర్తించి వారికి మందులు పంపిణీ చేశారు. కంటి ఆపరేషన్లకు ఎంపికైన వారికి త్వరలోనే మదనపల్లెలో ఆపరేషన్లు నిర్వహిస్తామని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు చంద్రబాబు, నౌషాద్, ఆస్పత్రి వైద్యులు షిరేన్, యాస్మిన్, అడ్మినిస్ట్రేటర్ కోటయ్య, కోఆర్డినేటర్ ప్రేమ్‌సాగర్, సిబ్బంది పాల్గొన్నారు.

15 మద్యం బాటిళ్లు స్వాధీనం

గుర్రంకొండ: అక్రమంగా ఉంచుకొన్న 15 మద్యం బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకొన్నారు. ఈ సంఘటన మండలంలోని నడిమికండ్రిగలో చోటు చేసుకుంది. స్థానిక హరిజనవాడకు చెందిన చెర్లోపల్లె గణపతి అనే వ్యక్తి గ్రామానికి సమీపంలో మద్యం బాటిళ్లు అక్రమంగా ఉంచుకున్నారనే సమాచారం అందుకొన్న పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 15 మద్యంబాటిళ్లు స్వాధీనం చేసుకొని నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మధురామచంద్రుడు తెలిపారు.

మహిళపై దాడి చేసిన వ్యక్తిపై కేసు

పెద్దతిప్పసముద్రం : మండలంలోని పోతుపేట పంచాయతీ పిడుమువారి పల్లికి చెందిన సుజాత అనే మహిళ తనకు రావాల్సిన దినసరి కూలి డబ్బులు అడిగినందుకు అదే గ్రామానికి చెందిన నరేష్ అనే వ్యక్తి ఆమెపై దాడి చేసిన విషయం పాఠకులకు తెలిసిందే. ఈ నేపథ్యంలో శనివారం బాధిత మహిళ ఫిర్యాదు మేరకు ఎస్ఐ నరసింహుడు దాడికి పాల్పడిన నరేష్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

స్కూటీ- స్కూటర్ ఢీ

– నలుగురికి గాయాలు

రాయచోటి టౌన్ : స్కూటీ – స్కూటర్ ఢీకొన్న సంఘటనలో నలుగురికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. శనివారం రాయచోటి రూరల్ పరిధిలోని రాజంపేట రోడ్డులోని ఎగువ తూముల వద్ద స్కూటర్, స్కూటీ రెండు ఢీకొన్నాయి. ఈ సంఘటనలో సుండుపల్లె మండలం మల్లప్పగారి పల్లెకు చెందిన జి.గంగాధర్, స్వరూప, ఏడు నెలల చిన్నారిని (బాలుడు) స్కూటీపై రాయచోటిలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించుకొని తిరిగి ఇంటికి వస్తున్నారు. అదే సమయంలో ఓదివీడు గ్రామం కావలి పల్లెకు చెందిన దయ్యాల వెంకటేశ్వర్లు స్కూటర్‌పై రాయచోటికి వెళ్లుతుండగా ఈ సంఘటన జరిగింది. ఈ ఘటనలో నలుగురికి గాయాలయ్యాయి. గాయపడిన వారిని స్థానికులు 108 ద్వారా రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. స్థానిక వైద్యులు ప్రాథమిక వైద్యం చేసి మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి బాధిత కుటుంబసభ్యులను విచారించి కేసు నమోదు చేశారు.

భక్తులకు అన్నదానం

రాయచోటి టౌన్ : రాయచోటి శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో భక్తులకు అన్నదానం చేశారు. శ్రావణ మాసం కావడంతో స్వామికి విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామికి, అమ్మవారికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. రంగు రంగుల పూలు, పట్టు వస్త్రాలతో అలంకరించి భక్తులకు దర్శన ఏర్పాటు చేశారు.

శ్రీలక్ష్మీనరసింహునికి విశేష పూజలు


స్వామివారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

గుర్రంకొండ: మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తిక మాసం ప్రారంభం కావడంతో రెండవ శనివారం రోజున టీటీడీ ఆధ్వర్యంలో వేకువజామునే స్వామివారికి పలు రకాల నైవేద్యాలు సమర్పించారు. తోమాల సేవ, ఏకాంతసేవ కావించారు. ఈసందర్భంగా స్వామివారిని రంగురంగుల పుష్పాలతో అందంగా అలంకరించారు. భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకొని స్వామివారిని సేవించుకొన్నారు. అర్చకులు భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీటీడీ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

ఆరోగ్య పరీక్షలతో తల్లీబిడ్డ క్షేమం


గర్భిణులకు పౌష్టికాహారం అందజేస్తున్న డాక్టర్ చంద్రశేఖర్

పీలేరు : క్రమం తప్పకుండా గర్భిణులు పరీక్షలు చేయించుకోవడం ద్వారా తల్లీబిడ్డ క్షేమంగా ఉంటారని డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. శనివారం మండలంలోని తలపుల పీహెచ్‌సీలో పీఎంఎస్‌ఎంఏ కార్యక్రమం నిర్వహించి గర్భవతులకు పరీక్షలు చేసి, సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాస్పత్రిలో ఉచితంగా నాలుగు రకాల పరీక్షలు, రెండు టీడీ సూది మందులు, 180 ఐఎఫ్ఏ మాత్రలు లభిస్తాయన్నారు. అలాగే వైద్యులు సూచించిన రక్త పరీక్షలు చేపించుకుని, ఆస్పత్రిలో కాన్పు చేపించుకోవడం ద్వారా తల్లీబిడ్డకు పూర్తి రక్షణ సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో పర్యవేక్షకులు కుసుమ, కృష్ణయ్య, హెచ్ఈ కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవీ నివారణపై అవగాహన అవసరం


హెచ్ఐవీపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పీలేరు : హెచ్ఐవీపై నివారణపై అవగాహన అవసరమని కోర్ స్వచ్ఛంద సంస్థప్రతినిధి రాజమ్మ అన్నారు. రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు స్థానిక తిరుపతి రోడ్‌లోని గురుకుల బాలికల పాఠశాలలో హెచ్ఐవీ మీకు తెలుసా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఐవీ /ఎయిడ్స్ ఎలా వస్తుంది, ఎలా రాదో అవగాహన కల్పించారు. హెచ్ఐవీ బాధితులపై సమాజంలో వివక్షత చూపరాదన్నారు. కార్యక్రమంలో కోర్ సభ్యులు షర్మిల, కె. సల్మా పాల్గొన్నారు.

మందక్రిష్ణ మాదిగ సభకు తరలిరండి



మాట్లాడుతున్న నరేంద్రబాబు

తంబళ్లపల్లె: మదనపల్లె చౌడేశ్వరి కల్యాణ మండపంలో ఈనెల 14వతేదీన నిర్వహించనున్న ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపకులు మందక్రిష్ణ మాదిగ సభకు మాదిగలు తరలిరావాలని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర నాయకులు నరేంద్రబాబు పిలుపునిచ్చారు. శనివారం శ్రీ శక్తిభవనంలో మండల ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పీ నాయకులతో సమావేశం నిర్వహించారు. 30 ఏళ్లుగా అలుపెరగని ఉద్యమాలతో ఎస్సీ వర్గీకరణ సాధించిన మంద క్రిష్ణ మాదిగ సభను విజయవంతం చేయాల్సిన బాధ్యత అందరూ గుర్తించాలన్నారు. మండలంలోని ఎంఆర్‌పిఎస్ నాయకులు, అభిమానులు పెద్ద ఎత్తున హాజరుకావాలన్నారు. జనసమీరణ కోసం మండల స్థాయి నాయకులకు బాధ్యతలు అప్పగించారు. సమావేశంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు మల్లికార్జున, వెంకటప్ప, బ్రహ్మయ్య, మారప్ప, గోపిదిన్నె మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

సీసీలు, సంఘమిత్రలకు శిక్షణ

తంబళ్లపల్లె: పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన ఎస్‌హెచ్‌జీ ఇన్‌కమ్ ప్రొఫైలింగ్ యాప్‌లో మహిళా గ్రూపులు, సభ్యులు, కుటుంబ సభ్యుల సమగ్ర సమాచారాన్ని సేకరించాలని ఏపీఎం గంగాధర్ కోరారు. శనివారం స్త్రీశక్తిభవనంలో ఎస్‌హెచ్‌జీ ఇన్‌కమ్ ప్రొఫైలింగ్ యాప్‌పై సీసీలు, సంఘమిత్రలకు శిక్షణ ఇచ్చారు. సంఘమిత్రలు కార్యక్రమాన్ని 16వతేదీకి పూర్తి చేయాలన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి గ్రూపు, సభ్యురాలి పూర్తి సమాచారం సంఘమిత్ర లాగిన్‌లో పొందుపరచాలన్నారు. గ్రూపు ప్రాథమిక సమాచారం, గ్రూపు ద్వారా సభ్యులు కలిసి చేస్తున్న జీవనోపాధి, వ్యాపారం, ఇతర వివరాలు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు రామలక్ష్మి, సీసీలు, సంఘమిత్రలు తదితరులు పాల్గొన్నారు.

తెలుగుభాష కోసం పరితపించిన సీపీ బ్రౌన్


సీపీ బ్రౌన్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న తెలుగుభాషా సంరక్షణ సమితి ప్రతినిధులు

రాజంపేట టౌన్: తెలుగుభాషా సాహిత్యం, అభివృద్ధికి సీపీ బ్రౌన్ ఎంతగానో పరితపించారని తెలుగుభాషా సంరక్షణ సమితి ప్రతినిధులు కొనియాడారు. ఈ నెల 10వ తేదీ సీపీ బ్రౌన్ జయంతిని పురస్కరించుకొని స్థానిక సరస్వతీ విద్యామందిరం పాఠశాలలో శనివారం ముందస్తుగా ఆయన జయంతి వేడుకను తెలుగుభాషా సంరక్షణ సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సమితి ప్రతినిధులు మాట్లాడుతూ బ్రౌన్ ఈస్ట్ ఇండియా కంపెనీ ఉద్యోగిగా విధులు నిర్వహించేందుకు ఆంధ్ర ప్రాంతానికి వచ్చి కడపలో నివసించి తెలుగుభాషాభివృద్ధికి కృషి చేశారని కొనియాడారు. ప్రతి ఒక్కరూ భాషాభిమానాన్ని చూపి తెలుగు భాషను కాపాడుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగుభాషా సంరక్షణ సమితి ప్రతినిధులు గంగనపల్లె వెంకటరమణ, బొట్టా రామచంద్రనాయుడు, బీవీ నారాయణరాజు, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

పసుపులేటి శంకర్‌కు ఆహ్వానం

నందలూరు: తెలుగు భాషాభివృద్ధి కృషి చేసిన చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ 226 జయంతి వేడుకలకు రాజంపేట స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ డాక్టర్ పసుపులేటి శంకర్‌ను ప్రధాన వక్తగా యోగివేమన విశ్వవిద్యాలయం ఆహ్వానించింది. ఈ సందర్భంగా శనివారం శంకర్ మాట్లాడుతూ ఈనెల 10న ఆదివారం ఉదయం 10 గంటలకు కడప సీపీ బ్రౌన్ పరిశోదన కేంద్రం గ్రంథాలయంలో జరిగే ఈ కార్యక్రమంలో యోగివేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ కృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా, డాక్టర్ పద్మ, కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ రఘునాథ రెడ్డి, విశ్రాంత ప్రధానాచార్యులు డాక్టర్ సంజీవమ్మ, ప్రముఖ కవి ఎలమర్తి మధుసూదన్, సాహితీ వేత్త ప్రతాప్‌రెడ్డి పాల్గొంటారని తెలిపారు.

రైతులతో 'బంతి'ఆట

- నష్టాల బాటలో పూల కర్షకులు
- ధరల పతనంతో రైతుల కుదేలు


సాగులో ఉన్న బంతిపూల తోట

పెద్దతిప్పసముద్రం: ప్రతికూల వాతావరణ పరిస్థితులు, నష్టాల వల్ల సంప్రదాయ పంటలను వదిలి ప్రత్యామ్నాయయంగా బంతిపూల సాగు చేపట్టిన రైతులతో విధి బంతాట ఆడుతోంది. తెగుళ్లతో పాటు ధర పతనం కర్షకులను కుదేలు చేస్తోంది. ఫలితంగా రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని బూర్లపల్లి, టి.సదుం, మద్దయ్యగారిపల్లి, కందుకూరు తదితర పంచాయతీల్లో ఈ ఏడాది సుమారు 30 ఎకరాల్లో రైతులు బంతిపూల సాగు చేపట్టారు. ఎకరాకు రూ.లక్షకు పైగా పెట్టుబడులు పెట్టారు. ఒక్కో మొక్కను రూ.3లకు కొని ఎకరానికి 15 వేల మొక్కలు నాటాలి. దీనికి సుమారు రూ.40 వేల వరకు ఖర్చు అవుతుంది.నీటి తడులు, దుక్కులు, మందుల పిచికారి, పెట్టుబడులు అదనం. పరిస్థితులు అన్నీ అనుకూలిస్తే 80 నుంచి 90 క్వింటాళ్ళ వరకు పూల దిగుబడి వస్తుంది. గిట్టుబాటు ధర లభిస్తే రైతుకు పండగే. ఖర్చులన్నీ పోనూ ఎకరానికి రూ.50 వేల వరకు లాభం ఉంటుంది. అయితే ఈ ఏడాది అధిక వర్షాల వల్ల బంతికి తెగుళ్ళ బెడద ఎక్కువైంది. మచ్చ తెగులుతో పూల తోటలు చాలా చోట్ల దెబ్బ తిన్నాయి. మందులు వాడినా ఎలాంటి ఫలితం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేతికొచ్చిన పంటపై ఆశలు వదులుకోలేక ఉన్న పూలనే కోసి మార్కెట్‌కు తరలించినా కిలో పూలు రూ.20లు పలకడంతో కనీసం కూలీల డబ్బులు కూడా రాలేదని రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పండగ సీజన్లలో కూడా ధరలు అంతంత మాత్రమేనని రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కార్తికమాసంలోనైనా ఆశించిన మేరకు ధరలు ఉంటాయేమోనని రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు.

నష్టాలు మిగులుతున్నాయి

ఒకటిన్నర ఎకరాలో బంతి పూల సాగు చేశాను. రూ.2 లక్షల దాకా ఖర్చు వచ్చింది. ఇంకా సరిగా పెట్టుబడులు కూడా చేతికందలేదు. బంతిపూల ధరలు పూర్తిగా పతనమై పోతున్నాయి. గిట్టుబాటు కాలేదు. నష్టాలే మిగులుతున్నాయి. ప్రభుత్వం నష్టపోయిన పూలతోట రైతులను ఆదుకోవాలి.

–చిన్న రెడ్డెప్ప, రైతు, పోతుపేట